సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం : 13 : జూలై : 2023



కార్ల దొంగ అరెస్ట్

నెల్లూరు. ప్రకాశం జిల్లాల్లో కార్లను దొంగతనం చేసిన ఒంగోలుకు చెందిన వ్యక్తిని కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,447
3 శాతం జీఎస్టీతో	రూ.5,610
సవర (8 గ్రా)	రూ.44,880

గరిష్టం/కనిష్టం
32.5 /26.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గాలిలో 85 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

దత్తపుత్రుడిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత



మాట్లాడుతున్న పోతుల సునీత

నెల్లూరు (దర్గామిట్ట): ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు తన దత్తపుత్రుడైన పవన్ కళ్యాణ్‌ను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆమె ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పవన్ ద్వారా చంద్రబాబు దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ బాబు దగ్గర గడ్డి తిని ఉన్మాదిలా, పిచ్చివాడిలా గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలోని వలంటీర్లలో 1.65 లక్షల మంది మహిళలున్నారని, వారిపై పిచ్చి మాటలు మాట్లాడితే చెప్పులతో బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశాడని, ఈ విషయం పవన్‌కు కనిపించదా అని ప్రశ్నించారు.

సీఎంకు రుణపడి ఉంటాం



రామాచార్యులు

తోటపల్లిగూడూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అర్చకులంతా రుణపడి ఉంటారని సింహపురి అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఈదూరు రామాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల్లాగే దేవదాయ శాఖ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఎన్నో ఏళ్ల అర్చకుల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారన్నారు. ఇప్పటికే అర్చకులకు గౌరవ భృతిని అందిస్తూ అండగా ఉంటున్న సీఎం మరిన్ని కీలక నిర్ణయాలతో అర్చకుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు.

అనుబంధాలకు బీటలు



- 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' అని సంస్కృత సూక్తి. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారని దీని అర్థం. నేటి కలికాలంలో అర్థాలు మారుతున్నాయి. దైవసాక్షిగా పరిణయమాడిన ఇల్లాలి బతుకును కొందరు భర్తలు అర్థాంతరంగా చిదిమేస్తున్నారు. జీవిత భాగస్వాములను విగతజీవులుగా మారుస్తున్నారు.
- పతియే ప్రత్యక్ష దైవం అని కూడా అంటారు. కానీ కొందరు మహిళలు భర్తల ప్రవర్తనను అనుమానించడం, ప్రశ్నలతో వేధించడం చేస్తున్నారు. కొంతమంది వివాహేతర సంబంధాలు కూడా పెట్టుకుని చివరికి భర్తను హత్య చేసేందుకూ.. చేయించేందుకు వెనుకాడటం లేదు.

– సాక్షి, నెల్లూరు డెస్క్

అనుమానం పెనుభూతమై..



మణెమ్మ (ఫైల్)

వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామానికి చెందిన తాటిపర్తి శ్రీనివాసులుకు ముత్తుకూరు మండలం లింగాయపాళెం గ్రామానికి చెందిన తాటిపర్తి మణెమ్మ (25)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. వివాహం జరిగిన కొన్నినెలల నుంచే అనుమానంతో శ్రీనివాసులు తన భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. కుమారులు తనకు పుట్టలేదని గొడవ పడేవాడు. దీంతో మణెమ్మ పుట్టింటికి వెళ్లింది. ఇటీవల పనిపై మణెమ్మ కుంకుమపూడి గ్రామానికి రాగా శ్రీనివాసులు చాకుతో విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు.

మద్యం మత్తులో భార్యకు ఉరి



లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పూరిమిట్ల శివకృష్ణ, అదే కాలనీకి చెందిన పులి మానస (27) ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో 2018 ఆగస్ట్ నెలలో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. శివకృష్ణ రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తలు తరచూ గొడవలు పడేవారు. దాంతోపాటు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న శివకృష్ణ మానస మెడకు చీరతో ఉరేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది.

పై సంఘటనలు అనుమానం అనే విషబీజం పచ్చని కాపురంలో ఎంతటి విపత్తులకు దారి తీస్తుందో తెలియజేస్తోంది. వరుసగా జరుగుతున్న ఇటువంటి సంఘటనలు మానవత్వాన్నే ప్రశ్నార్థకంలో పడేస్తున్నాయి. ఉరుకులు, పరుగుల నేటి కాలంలో బంధాలు, అనుబంధాలు బీటలు వారుతున్నాయి. అసూయ, అనుమానాలు విద్వేషాగ్నులను రగిలిస్తున్నాయి. ఏడడుగుల అనుబంధం రాగద్వేషాల ముందు విచ్ఛిన్నమవుతోంది. జీవితాంతం ఒకరికొకరు తోడుండాల్సిన ఆలుమగలే పగలు, ప్రతీకారాలతో హత్యలు చేసుకునే వరకు వెళ్తున్నారు. ఎందుకిలా జరుగుతోంది? యుగాల నాటి నుంచి కష్టసుఖాలను కలిసి పంచుకున్న దంపతుల వైఖరిలో నేడు వైరుధ్యాలు ఎందుకు పొడచూపుతున్నాయి? ప్రాణాలు బలితీసుకునే వరకు పరిస్థితులు ఎందుకు వెళ్తున్నాయి? నైతిక విలువలు నేర్పడంలో గురువులు, తల్లిదండ్రులు వైఫల్యం చెందుతున్నారా! ఉమ్మడి కుటుంబాలు కాలక్రమంలో తగ్గిపోవడమూ ఒక కారణమేనా! దేశంలోకి ప్రవేశించిన పాశ్చాత్య పోకడల ప్రభావమా! ఏది ఏమైనా ఈ హత్యల సంస్కృతి ఏ ఒక్కరికీ శ్రేయస్కరం కాదు. ఇల్లాలు లేని ఇల్లు శోభిల్లదు. యజమాని లేని ఇంటికి రక్షణ ఉండదు. తల్లిదండ్రులు లేకపోతే బిడ్డలకు ఆలనాపాలన కరువవుతుంది. అందుకే.. ఆవేశాన్ని, అసూయను, అహంకారాన్ని విడనాడి భార్యాభర్తలు ప్రేమ, అనురాగం పంచుకోవాలని మానసిక శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జిల్లాలో..

▶▶ గతేడాది	▶▶ ఈ ఏడాది
పదిమంది భర్తలు భార్యలను కడతేర్చారు. ఒక చోట ప్రియుడితో కలిసి భర్తను మహిళ హతమార్చింది.	ఇప్పటి వరకు నలుగురు వివాహితలు భర్తల చేతిలో హత్యకు గురయ్యారు.

ముత్తుకూరు మండలం పంటపాళేనికి చెందిన జి.చిన్నమణి (40) వ్యవసాయ కూలీ. భార్య, కుమారుడితో కలిసి నారాయణరెడ్డిపేటలో జీవించేవారు. ఇతని భార్య కూడా పనులకు వెళ్లేది. ఈ క్రమంలో ఆమెకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరుగుతుండేది. తర్వాత కొంత కాలానికి పంటపాళేనికి కుటుంబం వచ్చేసింది. ప్రియుడితో సంబంధం వదులుకోలేని ఆమె భర్తను చంపేయాలని కుట్ర పన్నింది. అనుకున్న విధంగా ప్లాన్ అమలు చేసి చివరకు కటకటాలపాలైంది. ఈ ఘటన జరిగి కొద్ది నెలలైంది.



ఒకరినొకరు గౌరవించుకోవాలి



– డాక్టర్ శ్రీనివాసతేజ, మానసిక వైద్య నిపుణుడు, నెల్లూరు

భార్యాభర్తల మధ్య గొడవలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. భర్త మద్యానికి బానిసై తరచూ డబ్బు తగలేసి తాగుతుండడంతో భార్య సహజంగానే ప్రశ్నిస్తుంది. దీంతో భర్త అహం దెబ్బతిని ఆవేశంలో భార్యను కొట్టడం.. లేదా చంపడం చేస్తున్నారు. ఇటువంటి భర్తలకు మానసిక వైద్యనిపుణుల వద్ద కౌన్సెలింగ్ ఇప్పిస్తే ప్రయోజనం ఉంటుంది. జీవిత భాగస్వాములు ఒకరి ఇష్టాలను మరొకరు గౌరవించాలి.

నమ్మకమే వివాహానికి పునాది



– మురళి, న్యాయవాది, ఉదయగిరి

జీవిత భాగస్వాముల మధ్య ఎలాంటి అరమరికలు లేని స్నేహం కొనసాగితే అనుమానాలకు తావు ఉండదు. ఒకరిపై ఒకరికి ఉండే అనుమానాలు హత్యల వరకు దారి తీస్తున్నాయి. సమాజంలో వస్తున్న పాశ్చాత్య పోకడలు, చిన్న కుటుంబాలు కూడా వీటికి కారణం కావొచ్చు. భారతీయ సంస్కృతి, సంప్రదాయలను పాటిస్తూ భార్యాభర్తలు విలువలతో సంసారం సాగిస్తే సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.

వచ్చే నెల 3 నుంచి ఐటీఐలో కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): ఐటీఐలో ప్రవేశం కోసం వచ్చే నెల 3, 4 తేదీల్లో ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వారికి గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామన్నారు. ఏ ఐటీఐలో చేరాలనున్నారో అక్కడ వచ్చే నెల ఒకటో తేదీలోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఐసీడీఎస్ పీడీగా హేనా సుజన

నెల్లూరు(వేదాయపాళెం): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిగా బి.హేనా సుజనను నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కావలి సీడీపీఓగా ఉన్న కె.సౌజన్య ఇన్‌చార్జిగా పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కావలి సీడీపీఓగా కొనసాగనున్నారు. ఇందుకూరుపేట సీడీపీఓగా పనిచేస్తున్న బి.హేనా సుజనకు ఫుల్ అడిషనల్ చార్జి ఇచ్చారు.

రంగడి ఆలయంలో తవ్వేకొద్దీ అక్రమాలు

- మూడురోజులుగా కొనసాగుతున్న ఏసీబీ అధికారుల తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా ఏసీబీ అధికారులు కొనసాగిస్తున్న తనిఖీల్లో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ప్రతి విభాగంలోనూ నిధులు దుర్వినియోగమయ్యాయనే అంశం తనిఖీల్లో వెల్లడవుతోంది. సుమారు 250 గ్రాముల బంగారు, ఒకట్నిర కిలోలకుపైగా వెండి ఆభరణాలు మాయమయ్యాయని అధికారులు గుర్తించారని తెలిసింది. ఉత్సవాలు, ప్రావిజన్స్, శానిటేషన్, ఇలా ప్రతి దానిలోనూ అవకతవకతలు జరిగాయి. నకిలీ కొటేషన్లు, వేరే వారి పేర్లపై కొందరు అధికారులు నిధులను కాజేశారని దర్యాప్తులో తేలింది. అవుట్ సోర్సింగ్ సిబ్బంది సైతం అక్రమాలకు తెరలేపారని గుర్తించారు. చివరికి స్వామి పేరుతో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లను సైతం దోచుకున్నారని ఏసీబీ గుర్తించింది. తనిఖీలు రెండు, మూడు రోజుల పాటు కొనసాగనున్నాయని, అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు బుధవారం తెలిపారు.

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 26.315 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 133 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.

భగ్గుమన్న సేవా సైనికులు



ముత్తుకూరు: పవన్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



కలిగిరి: నిరసన తెలుపుతున్న వలంటీర్లు, నాయకులు

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై సేవా సైనికులు భగ్గుమన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. పవన్ వెంటనే క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు.

- పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నిరసన ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనం

ముత్తుకూరు: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని వలంటీర్లు డిమాండ్ చేశారు. ముత్తుకూరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నినాదాలు చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారం చేపట్టారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎస్సై శివకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న తమను కించపరుస్తూ రాజకీయ పబ్బం గడుపుకోడానికి చేసిన ఆరోపణలకు పవన్ క్షమాపణ చెప్పాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, మేధావులు వలంటీర్ వ్యవస్థను అభినందించడాన్ని వినలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్, యల్లంగారి వెంకటేశ్వర్లు, గండవరం సూరి పాల్గొన్నారు.

ర్యాలీ, మానవహారం

కలిగిరి: పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండలంలోని 14 సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లు కలిగిరిలోని కలిగిరమ్మ తల్లి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న తమపై ఇష్టానుసారం మాట్లాడడం దారుణమన్నారు. కాగా వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందించిన సేవలు ప్రజలు మరిచిపోలేరన్నారు. కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడారన్నారు. కార్యక్రమంలో కలిగిరి ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లాభాలు తెచ్చే బాధ్యత మీదే..

- ఎఫ్‌పీఓలతో డీసీఓ సుధాభారతి



మాట్లాడుతున్న డీసీఓ సుధాభారతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో రైతులు పండించిన పంటలను మార్కెటింగ్ చేసి వారికి లాభాలను తీసుకొచ్చే బాధ్యత ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంస్థ)లదేనని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) సుధాభారతి అన్నారు. నెల్లూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న డీసీఓ కార్యాలయంలో బుధవారం ఎఫ్‌పీఓల ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులతో పనిలేకుండా వినియోగదారులకు సంతృప్తికరమైన ధరలకు పంటలను అందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ఇందుకోసమే ఎఫ్‌పీఓను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పంటలను ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేయడంలో డీసీఎంఎస్ (జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) ప్రధాన భూమిక పోషించాలన్నారు. అన్నదాతలకు రుణాలు అందజేసేందుకు డీసీసీబీ, నాబార్డులు అందుబాటులో ఉన్నాయన్నారు. 2023–24 సంవత్సరానికి వారి పరిధిలో సాగవుతున్న వాటి వివరాలను ఎఫ్‌పీఓలు రూపొందించాలన్నారు. ఈ–నామ్ అనే వెబ్‌సైట్‌లో సాగు చేసిన పంటల వివరాలు, ధరలను ఉంచడం ద్వారా అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతుబజార్లను ఏర్పాటు చేసేందుకు నాబార్డ్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం రవిసింగ్, కావలి డీఎల్‌సీఓ తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే నాపై పోటీ చెయ్

- నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే రామిరెడ్డి సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : నారా లోకేశ్‌కు దమ్ముంటే కావలిలో తనపై పోటీ చేసి గెలుపొందాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. అతనిపై 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని శపథం చేశారు. కావలిలోని తన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పచ్చపత్రికల చెత్త రాతలకు ఎవరూ భయపడరన్నారు. కుప్పంలో చంద్రబాబును, మంగళగిరిలో లోకేశ్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. తాను ప్రతిరూపాయి నిజాయతీగా సంపాదించానని, అందులోనే విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అయితే లోకేశ్ తన సభలో ల్యాండ్, శాండ్ లిక్కర్ మాఫియా వ్యక్తులను పక్కనే పెట్టుకుని తనపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు కావలికి వస్తే తుమ్మలపెంట రోడ్డు, పెద్దపవని బ్రిడ్జి, కావలి పెద్ద చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు చేపట్టాలని అర్జీలు ఇచ్చానని, కానీ టీడీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని తెలియజేశారు. నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌గా సాగిందని, కావలిలో జరిగిన సభకు ఒంగోలు, కందుకూరు, ఉదయగిరి నుంచి ఆటోల్లో జనాలను రప్పించినట్లు పేర్కొన్నారు. కావలిలో టీడీపీకి మిగిలేది గుండు సున్నా మాత్రమే అని ధీమా వ్యక్తం చేశారు.

బాబు, పవన్ తోడుదొంగలు

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తోడు దొంగలని, ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకునేందుకు కుట్రలు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని కొమరిక గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలు అతని అజ్ఞానానికి నిదర్శనమన్నారు. అతని మాటలకు వలంటీర్లు చూపుతున్న నిరసనను చూసి పవన్‌కు భయమేసిందని, అందుకే వెనక్కి తగ్గి అందరినీ అనలేదని బుకాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏ ఇంటికి వెళ్లి వలంటీర్ల సేవలపై ఆరాతీసినా తమ బిడ్డలతో సమానంగా వారిని అభివర్ణిస్తారని తెలిపారు. చంద్రబాబు ఒక్కడే జగన్‌ను ఎదుర్కోలేక పవన్‌ను అడ్డుపెట్టుకుని రామోజీతో కలిసి మూడు ముక్కలాట ఆడుతున్నాడన్నారు. దేశ ప్రధాని సైతం వలంటీర్ల సేవలను కీర్తించారని గుర్తుచేశారు. బాబు, రామోజీల డైరెక్షన్‌లో పవన్ పనిచేస్తున్నారని విమర్శించారు. దేశం మొత్తం వలంటీర్ల వ్యవస్థను అభినందిస్తుంటే బాబు, పవన్‌కు మాత్రం అవేమీ కనిపించడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, స్థానిక నేతలు ప్రభాకర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	రూ.25
సన్నవి	రూ.12
పండ్లు	రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	118	బ్రాయిలర్ స్కిన్‌లెస్	230
లేయర్ (లైవ్)	92		
బ్రాయిలర్ చికెన్	208	లేయర్ చికెన్	156

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

- సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగర పరిధిలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 11వ డివిజన్ సరస్వతీనగర్, ఎన్టీఆర్ నగర్ మూడో బిట్ తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనిల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా.. అని ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు రూ.13 కోట్లతో కొన్ని పనులు పూర్తి చేశామని, కొన్ని ప్రారంభం దశలో ఉన్నాయన్నారు. త్వరలో మరో రూ.18 కోట్లతో రోడ్లు, డ్రెయిన్‌లు పూర్తి చేసే కార్యక్రమం చేయబోతున్నామన్నారు. నగరంలో దాదాపు 600 విద్యుత్ స్తంభాలను మార్చామని, జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే దాదాపు 11 వేలకు పైగా ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. 2024లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణ, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరి : పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. మండలంలోని నేలటూరు సచివాలయ పరిధిలోని నేలటూరు, సర్వరాబాదు గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకుంటే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలియజేశారు. మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, పార్టీ నేతలు ఇత్తడి రమణయ్య, శ్రీనివాసులు, పి.సుబ్బారావు, లక్ష్మీనరసయ్య, జి.వెంగళరెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

ఖైనీ బస్తాల చోరీలో ఇద్దరి అరెస్ట్

గుడ్లూరు: మండలంలోని తెట్టు గోడౌన్‌లో ఖైనీ ప్యాకెట్ల బస్తాలను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాములునాయుడు బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన కొత్త బాలకృష్ణ, మద్దూరుపాడుకు చెందిన ఇండ్ల మహేష్ మంగళవారం అర్ధరాత్రి తెట్టు వద్ద వెంకటేశ్వరరాజుకు చెందిన గోడౌన్‌లో గోడకు కన్నం వేసి 18 బస్తాల హాన్స్ ఖైనీ ప్యాకెట్లను చోరీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. ఖైనీ ప్యాకెట్‌ల బస్తాలతో ఓ ఆటో బుధవారం నెల్లూరుకు వెళ్తుందనే సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి ఖైనీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బాలకృష్ణ, మహేష్‌ను అదుపులోకి తీసుకుని కందుకూరు కోర్టులో పరిచినట్లు ఎస్సై తెలపారు.

పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

- కలెక్టర్ హరినారాయణన్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం: బడిఈడు పిల్లలు బయట ఉండరాదని, కచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. మండలంలోని రేబాల గ్రామ సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికాన్ని జయించాలంటే కేవలం విద్యతోనే సాధ్యమన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఎక్కడైనా చిన్నారులు వివిధ కారణాలతో మధ్యలోనే విద్యకు స్వస్తి చెప్పి ఉంటే వారిని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే సమీప పాఠశాలలు లేదా కళాశాలల్లో చేర్చాలని సూచించారు. అనంతరం రేబాల ఉన్నత పాఠశాలలో రెండో దశ కింద జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను ఆరా తీసి, సచివాలయాల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ గంగాభవాని, సర్పంచ్ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ పెంచల శ్యామ్, ఎంఈఓ దిలీప్ ఉన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్) : ప్రేమ విఫలం కావడంతో ప్రియురాలి పుట్టినరోజు నాడే ప్రియుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. లక్ష్మీపురానికి చెందిన సుబ్బారావు, సుజాతకుమారి దంపతులు. వారికి ఓ కుమార్తె, వెంకట సాయిసుభాష్(28) సంతానం. 2006లో సుబ్బారావు మృతిచెందడంతో తల్లి సుజాత పిల్లల్ని పెంచింది. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు వెంకటసాయిసుభాష్ ఎంబీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లోని టెస్ట్ గ్రిడ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. కాగా హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. మనస్పర్థల నేపథ్యంలో రెండు నెలలుగా వీరి మధ్య మాటల్లేవు. అప్పటి నుంచి ప్రియురాలిని మరిచిపోలేక నిత్యం బాధపడుతుండేవాడు. ఈనెల 11న ప్రియురాలి పుట్టినరోజు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై అర్ధరాత్రి హాలులోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సుజాత బుధవారం తెల్లవారుజామున నిద్ర లేచిచూడగా కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతుండడాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు మృతుడి తల్లి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్ల దొంగ అరెస్ట్

- రూ.15 లక్షల విలువైన మూడు కార్ల స్వాధీనం

కావలి రూరల్: నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కార్ల దొంగతనం చేస్తున్న ఒంగోలుకు చెందిన షేక్.అమీర్‌ను కావలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ ఎం.వెంకటరమణ కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కావలికి చెందిన సయ్యద్ సిద్దిక్ అహ్మద్, ఒంగోలుకు చెందిన అమీర్ స్నేహితులు. అందరితో కలివిడిగా ఉండేవారు. అలాగే కార్ల యజమానులతో కూడా సన్నిహితంగా ఉంటూ వారికి డ్రైవర్లుగా వెళ్లేవారు. వివాహాల కోసం కార్లను అద్దెకు తీసుకెళ్లి తిరిగి ఇవ్వకుండా గుర్తుతెలియని వ్యక్తులకు కుదువపెట్టుకుని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవారు. పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీకి చెందిన షాహుల్ తన కారును అద్దెకు ఇస్తుండేవాడు. ఈ క్రమంలో ఆ కారుపై వీరిద్దరి కన్నుపడింది. యజమానితో మాట్లాడి అద్దెకు తీసుకెళ్లి కుదువ పెట్టుకుని సమాధానం చెప్పకుండా తిరుగుతుండడంతో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎ.సుధాకర్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా నిందితులు కావలిలో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో గాలింపు చర్యలు చేపట్టి అమీర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సుమారు రూ.15 లక్షల విలువ చేసే మూడు కార్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా సిద్దిక్ అహ్మద్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ

- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

మనుబోలు: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండల పరిధిలోని కొండూరుసత్రం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. నెల్లూరు నగరానికి చెందిన గాలి దయాకర్ నెల్లూరు ఆర్టీసీ డిపో డీఎం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గూడూరులో స్నేహితులను కలిసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే మార్గంలో కోట మండలం కాశీపురానికి చెందిన సుబ్రహ్మణ్యం–గాయత్రి దంపతులు బైక్‌పై గూడూరు వైపు వెళ్తున్నారు. మండల పరిధిలోని కొండూరుసత్రం వద్ద దయాకర్ బైక్ అదుపుతప్పి సుబ్రమణ్యం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. వీరిలో దయాకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్వేయర్ ప్రమాదంపై డైరెక్టర్ సమీక్ష

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో మంగళవారం బొగ్గు తరలించే కన్వేయర్ నుంచి మంటలు వ్యాపించిన ఘటనపై డైరెక్టర్ చంద్రశేఖరరాజు బుధవారం సమీక్ష నిర్వహించారు. కన్వేయర్‌లో ఇరుక్కుపోయిన బొగ్గుపై రాపిడి జరగడం వల్ల ఒక్కసారిగా మంటలు, పొగ వ్యాపించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సుమారు 50 మీటర్ల మేరకు కన్వేయర్ కాలిపోయింది. ఈ ప్రమాదం వల్ల జరిగిన నష్టం, మరమ్మతులు చేపట్టే అంశంపై ఇంజినీర్లు, సంబంధించి కాంట్రాక్టర్లతో ఆయన సమీక్ష జరిపారు. తదుపరి చర్యలపై చర్చించారు.